సాక్షి
జనగామ
గురువారం । 12 । జూన్ । 2025



అక్రమార్కులు ఎవరు?
సబ్ ఇంజనీర్ల రిక్రూట్‌మెంట్‌లో జరిగిన అక్రమాలకు బాధ్యులను గుర్తించడంలో టీజీ ఎన్పీడీసీఎల్ విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. - 8లో▸



'భూభారతి'తో ప్రతీ రైతుకు న్యాయం
భూ భారతి చట్టంతో ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/25^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షి దారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు కోర్టు ముందుకు రాని కేసులు, కోర్టులో పెండింగ్ ఉన్న కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, న్యాయస్థానంలో పెండింగ్ ఉన్న కేసు లోక్ అదాలత్‌కు వచ్చిన తర్వాత పరిష్కారమైతే కోర్టులో చెల్లించిన రుసుము కూడా పార్టీలకు తిరిగి చెల్లిస్తారని తెలిపారు. సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందని, రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాలు, డబ్బు రికవరీ, మోటార్ వెహికల్ యాక్సిడెంట్, చిట్ ఫండ్, ఎలక్ట్రిసిటీ, చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు.

పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



కొడకండ్ల : ప్రీస్కూల్ పిల్లలందరినీ తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సీడీపీఓ సత్యవతి కోరారు. 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలకేంద్రంలో ఇంటింటికీ తిరిగి అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఈనెల 17 వరకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి అర్హత కలిగిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని చెప్పారు. అలాగే అవగాహన ర్యాలీలు నిర్వహించి తల్లిదండ్రులకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరళ, అంగన్‌వాడీ టీచర్లు మైమూదాబేగం, సరిత, ఉప్పలక్ష్మి, వినోద, నర్సమ్మ, మంజుల, మాధవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యకు అనుమతి లేదు : డీఈఓ

జనగామ: పట్టణంలో శ్రీ చైతన్య పేరుతో ఎలాంటి ప్రైవేట్ స్కూల్ అనుమతి లేదు.. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీఈఓ భోజన్న తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీచైతన్య పేరుపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో వైష్ణవి స్కూల్ పేరుతోనే రన్ చేయాలని, ఒక వేళ అలాగే కంటిన్యూ చేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. రికగ్నైజేషన్ లేకుండా ప్రైవేట్ స్కూళ్లను నడిపితే చర్యలు కఠినంగా ఉంటాయని, ప్రీ ప్రైమరీ స్కూల్ యాజమాన్యాలు సైతం తమ అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్లకు సంబంధించి మూడు నెలల వేతనం రెండు, మూడు రోజుల్లో రానున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం వండి వడ్డించే గ్రూపులకు బకాయి ఉన్న సుమారు రూ.3కోట్ల బడ్జెట్ కూడా త్వరలో రిలీజ్ అవుతుందని అన్నారు.

కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటన

లింగాలఘణపురం: మండలంలో బుధవారం కేంద్ర జలశక్తి అభియాన్ బృందం పర్యటించింది. లింగాలఘణపురం, నెల్లుట్ల, నవాబుపేట, నేలపోగుల, కొత్తపల్లి, గుమ్మడవెల్లి, సిరిపురం, కళ్లెం, నాగారం గ్రామాల్లో నిర్మించిన సోక్ పిట్స్, మ్యాజిక్ సోక్ పిట్స్, కమ్యూనిటీ సోక్ పిట్స్, ప్లాంటేషన్, వాటర్ రీజార్జ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యుడు, సైంటిస్ట్ సెంటర్ వాటర్ బోర్డు వెంకటగిరి, ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకన్న, డీఆర్‌డీఓ సరిత, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఎంపీఓ రఘురామకృష్ణ, ఏపీఓ బిక్షపతి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కొడకండ్ల : ఏడునూతుల, కొడకండ్ల గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు జాయింట్ డైరెక్టర్ పుష్పలత కుమారి, సీనియర్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ అంకిత్ బుధవారం పర్యటించారు. ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. ఆసరా పింఛన్ లబ్ధిదారులు, ఉపాధి కూలీలతో మాట్లాడి జాబ్‌కార్డుల అప్‌డేషన్, సెవెన్ రిజిస్టర్లతోపాటు సడక్ యోజన కింద చేపట్టిన రోడ్ల నిర్మాణాల గురించి తెలుసుకున్నారు. డీపీఎం వినిత రెడ్డి, ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, ఎంపీఓ ఇందిర, ఏపీఓ కుమారస్వామి పాల్గొన్నారు.

ఔరా.. సర్కారు స్కూళ్లు

వేసవి సెలవుల తర్వాత నేడు తెరుచుకోనున్న పాఠశాలలు | విద్యార్థులకు స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు

మామిడి తోరణాలు.. తీరొక్కపూలు.. రంగురంగుల బొమ్మలు.. వాకిట ముగ్గులు.. వేసవి సెలవుల అనంతరం నేటి(గురువారం) నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా అలంకరించారు. విద్యార్థులకు స్వాగతం పలికేందుకు కలెక్టర్ రిజ్వాన్ బాషా పర్యవేక్షణలో డీఈఓ భోజన్న ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు. మొదటిరోజే పిల్లలకు యూనిఫాం, నోటు, పాఠ్య పుస్తకాలు అందించేందుకు అన్నీ సిద్ధం చేశారు. జిల్లాలో 548 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, గురుకులాలు ఉండగా.. వీటిలో 45వేల పైచిలుకు విద్యార్థులు చదువుతున్నారు. 'బడి బాట'తో సంఖ్య మరింత పెరగనుంది. - జనగామ



అలంకరణలో పాలకుర్తి పీఎస్

సాక్షి పరిశీలన

ప్రైవేటుకు దీటుగా..



గణేశ్ స్ట్రీట్ ప్రాథమికోన్నత పాఠశాల

జనగామ: ప్రైవేట్ పాఠశాలలకు కేంద్ర బిందువైన జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న గణేశ్ స్ట్రీట్ ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7 తరగతులు ఉన్నాయి. హెచ్‌ఎంతో 9 మంది ఉపాధ్యాయులు అంకిత భావంతో విద్యాబోధన చేస్తున్నారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలు ఎన్ని ఉన్నా.. గత ఏడాది 184 మంది పిల్లలు ఉండగా.. ఈసారి 'బడిబాట'లో మరో 40 మందికి పైగా అడ్మిషన్లు పొందారు. చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, తల్లిదండ్రులతో నిర్వహిస్తున్న సమావేశాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి.



స్టేషన్‌ఘన్‌పూర్: పక్క ఫొటోలో కనిపిస్తున్న ఉన్నత పాఠశాల శివునిపల్లిలో ఉంది. 1952లో ప్రారంభించారు. ఈ స్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థుల్లో చాలా మంది ఉన్నత స్థాయికి ఎదిగారు. మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్యతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. కొంతమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు, కోచ్‌లు, గెజిటెడ్ హెచ్‌ఎం స్థాయికి ఎదిగారు.

మూడో ఏటనే.. బడికి పంపారు



నన్ను రెండేళ్లు దాటి మూడో ఏడు రాగానే బడికి పంపించారు. అయితే.. నా గోల భరించలేక మా అమ్మ ఓ పథకం వేసి బడిలో అయితే కాస్త భయంతో ఉంటానని అనుకుని ఉండొచ్చు. ప్రైమరీ స్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేవారు. పెద్ద సారు క్యాడర్ పెద్దది కాబట్టి మాకు చిన్నసారే పలక మీద ఓనమాలు పెట్టించేది. ఆయనకు పెద్ద మీసాలు ఉండేవి. పిల్లలంతా ఈయనకి కూడా భయపడే వారు. అనంతరం హైస్కూల్ చదువులోనూ ఎప్పుడూ ఫస్ట్ ఉండేదాన్ని. బడికి వెళ్లాలంటే ఏనాడు భయపడలేదు. తల్లి ప్రోత్సాహంతో చదివి ఉన్నతస్థాయికి ఎదిగాను. ఇప్పటికీ బాల్య స్మృతులు గుర్తుకు వస్తే.. ఎంతో సంతోషంగా ఉంటుంది. **- నెల్లుట్ల రమాదేవి, ఆంధ్రాబ్యాంకు రిటైర్డ్ జోనల్ చీఫ్ మేనేజర్, శివునిపల్లి**

చెప్రాసి అంటే హడల్..



జనగామ రూరల్ : నాటి కాలంలో బడికి వెళ్లాలంటే భయపడే వాళ్లం. ఒక్క పూట బడి మానేసినా.. ఉపాధ్యాయుడి కంటే చెప్రాసి కట్టే పట్టుకొని వస్తున్నాడంటే వణికి పోయేటోళ్లం. అప్పుడు గ్రామంలో ఒకే ఒక్క పాఠశాల ఉండడంతో సర్పంచ్ నుంచి పటేల్ పట్వారీ పిల్లల వరకు అందరూ సర్కారు స్కూల్‌కే వెళ్లాం. విద్యతో పాటు క్రీడలు కూడా నేర్పించే వాళ్లు. స్వగ్రామం వడ్లకొండలోనే 7వ తరగతి వరకు చదువుకున్నాను. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో ఉస్మానియా యూనివర్సిటీ వీసీగా ఉన్నత పదవిలో ఉన్నాను.

- రవీందర్‌యాదవ్, వీసీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, వడ్లకొండ(జనగామ)

చదివిన స్కూల్‌లోనే టీచర్‌గా..



తరిగొప్పుల: మేం చదువుకునే రోజుల్లో టీచర్లు అంటే భయం ఉండేది. ఎదురుగా నిలబడే సాహసం చేసేవాళ్లం కాదు. వారు స్థానికంగానే ఉండే వారు. చదవకున్నా.. హోం వర్క్ చేయకపోయినా బెత్తంతో దండించేవారు. ఆ భయం నేటి విద్యార్థుల్లో లేదు. స్థానిక పాఠశాలలో 1970 సంవత్సరం విద్యాభ్యాసం ప్రారంభించాను. కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేసి ప్రభుత్వ టీచర్‌గా పదోన్నతి పొందాను. విద్యాబుద్ధులు నేర్పించిన పాఠశాలలోనే టీచర్‌గా పని చేశాను.

- మచ్చ చిరంజీవులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, తరిగొప్పుల

స్వాగత తోరణం

బచ్చన్నపేట: పడమటి కేశ్వాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వాగతం పలికేందుకు పాఠశాలను మామిడి కొమ్మలు, స్వాగత తోరణాలతో అలంకరించారు.



స్వాగతం పలికేందుకు సిద్ధమైన పడమటికేశ్వాపూర్ స్కూల్

మామిడి తోరణాలతో అలంకరణ

పాలకుర్తి టౌన్ : స్థానిక ప్రాథమిక పాఠశాల ప్రధాన గేటు, తరగతి గదులను కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు, బెలూన్లతో అలంకరించారు. ప్రధానోపాధ్యాయులు చిదురాల శ్రీనివాస్ ఆధ్వర్యాన విద్యార్థులను ఆకర్షించేలా వాల్‌కు విద్యార్థులకు ఉపయోగపడే ఇంగ్లిష్, తెలుగు అక్షరమాల, జాతీయ నాయకులు, ప్రకృతి చిత్రాలతో తీర్చిదిద్దారు.

టీచర్లకే తల్లిదండ్రుల సపోర్టు



జనగామరూరల్: ఒకటో తరగతి నుంచి 5 వరకు స్వగ్రామంలోనే చదివాను. తమ్మడపల్లి, పెద్దరామన్‌చర్ల, పెద్దపహాడ్, పసరమడ్ల నుంచి విద్యార్థులు ఈ స్కూల్‌కే వచ్చేవారు. చిన్నప్పుడు నాకు సోమిరెడ్డి, మల్లారెడ్డి సార్లు తొలిగురువులు. మాకు చదువుతోపాటు ఆట పాటల్లో ప్రత్యేక పీరియడ్స్ ఉండేవి. ఉపాధ్యాయులు చాలా శ్రద్ధ తీసుకునేవారు. ఒక్క రోజు పాఠశాలకు రాకున్నా ఆయమ్మ(గోపమ్మ) ఇంటికి వచ్చి ఎందుకు రాలేదని అడిగే వారు. గురువులంటే భయమూ భక్తి ఉండేది. చదువు సరిగా రాకపోతే ఉపాధ్యాయులు మందలించే వారు. తల్లితండ్రులు కూడా వారినే సమర్థించే వారు.

- బాలాచారి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి, ఓబుల్‌కేశ్వాపూర్, జనగామ

ఉపాధ్యాయుల చొరవతో అడ్మిషన్లు

రఘునాథపల్లి: ఖిలాషాపూర్ ప్రాథమిక పాఠశాలలో గత ఏడాది 48 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుత 'బడిబాట'లో 65 మంది కొత్తగా అడ్మిషన్ పొందడంతో సంఖ్య 113కు చేరింది. హెచ్‌ఎం యాదవరెడ్డి, సహచర ఉపాధ్యాయుల శ్రమ ఫలించింది. గత ఏడాది విహారయాత్రలకు వెళ్లడం, ప్రజ్ఞోత్సవ పోటీల్లో 10 ఈవెంట్లకు ఏడు ఈవెంట్లలో ప్రతిభ చాటడం, సమ్మర్ క్యాంపు, పాఠశాలకు నూతన హంగులతో కార్పొరేట్‌కు మించి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలో చదివించే తల్లిదండ్రులు తమ పిల్లలను ఇందులో చేర్పించారు.

రంగుల హరివిల్లు



జనగామ రూరల్ : యశ్వంతపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్వాగతం పలికేందుకు సిద్ధమైయింది. స్కూల్‌లో ప్రముఖుల, రాజకీయ నాయకుల చిత్రాలు, పక్షులు, ప్రకృతి అందాలతో కూడిన బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి. హెచ్‌ఎం దివాకర్‌రెడ్డి ఆధ్వర్యాన దాతలు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలకు పెయింటింగ్ వేయించి తీర్చిదిద్దారు. ఇక్కడ విజ్ఞానం, మానసిక వికాసం అందించే దిశగా కృషి చేస్తున్నారు.

రోజు 13 కిలోమీటర్లు నడిచి వెళ్లే వాడిని..



పాలకుర్తి టౌన్ : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1978 నుంచి 1983 వరకు చదువుకున్నాను. ఆ రోజుల్లో రోడ్లు, రవాణా సౌకర్యం ఉండేది కాదు. రోజు సమయపాలన పాటిస్తూ వల్మిడి నుంచి 30 మంది స్నేహితులతో కలిసి 13 కిలోమీటర్లు నడిచేటోళ్లం. ప్రభుత్వ పాఠశాల నేర్పించిన క్రమశిక్షణే ఈ స్థాయికి ఎదిగేలా చేసింది.

- పోతుగంటి నరసయ్య, ఎంఈఓ

బడికి తప్పించే వాళ్లం కాదు



జఫర్‌గఢ్: స్థానిక ఉన్నత పాఠశాలలో 1973 సంవత్సరం పదో తరగతి పూర్తి చేశాను. ఉపాధ్యాయులంటే భయం, గౌరవం ఉండేది. కరెంటు సౌకర్యం లేకున్నా గుడ్డి దీపాల వెలుతురులో తల్లిదండ్రులు చదివించే వారు. సర్కారు బడిలో చదవడంతోనే ఈ పొజిషన్‌కు చేరుకున్నా. ఆ అభిమానంతోనే జఫర్‌గఢ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకలుగా మార్చినం.

- డాక్టర్ సాంబశివరావు, ఆరోగ్యశాఖ మాజీ డైరెక్టర్

బాయికాడికి పొమ్మంటే బడికి పోయేది



లింగాలఘణపురం : నాన్న బాయికాడికి పోయి పొలం దున్నమంటే నేను బడికి పోయే వాడిని. ఇష్టంతో చదువుకున్నాను. ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ఫిజిక్స్ విభాగంలో ప్రొఫెసర్ అయ్యాను. చిన్నప్పటి నుంచి ఒక్కరోజు బడికి పోకపోతే మార్కులు తక్కువ వస్తాయనే భయంతో నాన్న బాయికాడికి పొమ్మన్నా స్కూల్‌కు వెళ్లేది. అప్పట్లో చదువుకోవడానికి ఇప్పటిలా సౌకర్యాలు లేవు. పుస్తకాలు కొనుక్కోవడానికి పైసలు లేక ఇబ్బంది పడేది.

- బుట్టిరెడ్డి రవీందర్‌రెడ్డి, ప్రొఫెసర్, ఉస్మానియా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం, లింగాలగణపురం

పురాతన బడికి పూర్వ వైభవం

దేవరుప్పుల: సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రైవేట్ స్కూళ్ల కారణంగా విద్యార్థుల సంఖ్య తగ్గి ప్రాభవం కోల్పోయింది. ఇటీవల బదిలీపై వచ్చిన హెచ్‌ఎం అంబటి అంజయ్య, ఉపాధ్యాయులు గ్రామస్తుల సహకారంతో బడికి పూర్వ వైభవం తేవడానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ వంగాల మల్లారెడ్డి, ప్రస్తుతం మరో చోట పనిచేస్తున్న ఉపాధ్యాయుడు దివాకర్‌రెడ్డి, జీపీ భాగస్వామ్యంతో పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నారు. గత ఏడాది 40 మందికి పరిమితమైన విద్యార్థుల సంఖ్య 60కి పెంచేందుకు కసరత్తు ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణం, భవన సముదాయాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు.



సర్కారు బడిలో ప్రాథమిక విద్య



చిన్నతనంలో మా అమ్మ తన ఒడిలోనే ఓనమాలు నేర్పించింది. మూడేళ్ల వరకు స్వగ్రామంలో ఓ ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసి మూడో తరగతి వరకు చెప్పించింది. అనంతరం జనగామ పట్టణంలోని ఏబీవీ ప్రభుత్వ పాఠశాలలో విద్య కొనసాగింది. నాడు బడి అంటే ఓ భయం.. క్రమశిక్షణతో చదివిన చదువు ఉద్యోగం తెచ్చి పెట్టింది. **- వంగాల మల్లారెడ్డి, రిటైర్డ్ టీచర్, సింగరాజుపల్లి, దేవరుప్పుల**

సర్కారు స్కూళ్లను బతికించుకుందాం..

● జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న



మాట్లాడుతున్న డీఈఓ భోజన్న

జనగామ: అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలను బతికించుకునేందుకు ప్రతీ తల్లిదండ్రి ఆలోచించాలని డీఈఓ భోజన్న అన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో బుధవారం డీఈఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచేలా అంకిత భావంతో పని చేస్తామని, సామాజికంగా వెనుకబడిన విద్యార్థులపై అదనంగా దృష్టి సారిస్తామని చెప్పారు. జిల్లాలోని ప్రతీ పాఠశాలను సందర్శించి, విద్యాబోధన విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మండల, జిల్లా స్థాయిలో ప్రణాళిక తయారు చేసి పాఠశాల వారీగా ఉపాధ్యాయుల ప్రగతి, విద్యార్థి ప్రతిభపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 125 పాఠశాలల్లో 329 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేశామని, ఇందులో సబెక్టుల వారీగా 543 కంటెంట్లు లోడ్ చేసి ఉంటుందని వివరించారు. ప్రత్యక్ష బోధనతో పాటు డిజిటల్ ద్వారా కార్పొరేట్ స్థాయి విద్య అందించనున్నట్లు తెలిపారు. 6 నుంచి 10 తరగతులకు ఏఐ(ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) పాఠాలు సైతం కొనసాగుతున్నాయని, 1 నుంచి 5 వరకు ఎఫ్‌ఎల్‌ఎన్ ఏఎక్సల్ ద్వారా ఏఐ బోధన గత ఏడాది నుంచే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్ అందించామని, 'బడి బాట' కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చే స్పందన సర్కారు బడుల పనితీరుకు నిదర్శనమని వివరించారు.

ఉచిత విద్యుత్ బకాయిలు సత్వరం చెల్లించాలి

● రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

రఘునాథపల్లి: రజకులకు, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ బకాయిలు సత్వరం చెల్లించాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మైలారం వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రజకుల సమస్యల పరిష్కారానికి ఈనెల 17న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కరపత్రాలను బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. గత ప్రభుత్వం రజకులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ కేటాయించగా.. ఈ ప్రభుత్వం ఆ బకాయిలు చెల్లించక పోవడం దారుణమన్నారు. రజకులకు, నాయీ బ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, వయసు 50 సంవత్సరాలు నిండిన వారికి పింఛన్, రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు మరికుక్కల సారయ్య, యాదగిరి, దశరథ, సోమనాథ్, ఉమేష్, నాగరాజు, నర్సయ్య, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కల్వగూరి ప్రభాకర్, నరేష్, ప్రవీణ్, రాములు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టే నిర్మాణాల విషయమై పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని హౌసింగ్ డీఈ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధి గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ నియమ, నిబంధనలపై బుధవారం తానేదార్‌పల్లి జీపీలో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు తప్పనిసరిగా 400 నుంచి 600 చదరపు అడుగుల్లోనే ఇళ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. హౌసింగ్ ఏఈ అఖిల పాల్గొన్నారు.

బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

● కలెక్టర్ రిజ్వాన్ బాషా



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అధికారులు

జనగామ రూరల్: బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దడంతోపాటు బాలల హక్కులను పరిరక్షించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో కార్మిక, జిల్లా సంక్షేమ శాఖలు సంయుక్త ఆధ్వర్యాన ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లలు ఆటపాటలతో విద్య అభ్యసించేలా చూడాలని, వారికి అనుకూలమైన విద్యావాతావరణం కల్పించాలని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థతోపాటు చట్టాలపై అవగాహన కల్పించాలని, ఇందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, జిల్లా సహాయ కార్మిక అధికారి కుమారస్వామి, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ ఉప్పలయ్య, బాలల పరిరక్షణ అధికారి రవికాంత్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ రవికుమార్, స్కోప్ ఎన్జీఓ కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్ పనులు వేగవంతం చేయాలి

పట్టణంలోని దయానిలయం వద్ద నిర్మాణమవుతున్న ఇంటిగ్రెటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి పనులను పరిశీలించిన ఆయన మాట్లాడారు. పట్టణ వాసుల సౌలభ్యం కోసం నిర్మాణం చేపట్టిన మోడల్ మార్కెట్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంకటేశ్వర్లు, డీఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్ల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



డీఈఓ భోజన్నకు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

జనగామ రూరల్: స్కావెంజర్ల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కమిటీ ఆధ్వర్యాన డీఈఓ భోజన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరం పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించి కేవలం మూడు నెలలకు మాత్రమే వేతనాలు చెల్లించారని అన్నారు. గత వేసవిలో ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు పీపీఎల్స్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నల్లనాగుల రాజు, ప్రధాన కార్యదర్శి అంకుషావలి, జిల్లా బాధ్యులు, శ్రీహరి, శ్రీరామ్, రాజారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టెక్నోజిల్-2025 సంబురం

● ఆటలు, చదువు రెండూ ముఖ్యమే : సీజేఐటీ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి



బైక్‌రేస్ పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు



కల్చరల్ ఈవెంట్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జనగామ: జనగామ మండలం యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న టెక్నోజిల్-2025 వేడుకలు బుధవారం ముగిసాయి. చివరిరోజు సంబరాలను కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి ఆధ్వర్యాన నిర్వహించారు. స్లో బైక్‌రేసింగ్, మెహందీ, రంగోలీ, ఫేస్ పెయింటింగ్, నృత్య పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫ్యాషన్ షో, డీజేనైట్ ప్రోగ్రాం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విజయపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఆటలతో పాటు చదువూ ముఖ్యమే అన్నారు. తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను నెరవేర్చే విధంగా సమాజంలో మంచి పౌరులుగా ఎదగాలన్నారు. చివరలో ఆయా పోటీల్లో గెలు పొందిన విజేతలకు డైరెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ ఏఎస్.రావు, కోకన్వీనర్ జి.సరిత పాల్గొన్నారు.

కొలతల ప్రకారమే ఇంటి నిర్మాణాలు

● హౌసింగ్ డీఈ భజరంగ్ లాల్

బచ్చన్నపేట : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కొలతల ప్రకారమే చేపట్టేలా చూడాలని హౌసింగ్ డీఈ భజరంగ్‌లాల్ అన్నారు. బుధవారం మండల పరిధి గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఇళ్ల నిర్మాణాలపై పైలెట్ గ్రామమైన సాల్వాపూర్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నిర్మాణ కొలతలు ఏమాత్రం పెరిగినా ఆన్‌లైన్‌లో ఆ ఇంటిని తీసుకోదు.. దీంతో లబ్ధిదారులకు బిల్లు రాదు.. అందుకే వారికి ముందస్తుగా తెలియజేయాలన్నారు. ఇంటికి వినియోగించే మెటీరియల్ తదితరాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాజీపేట జంక్షన్‌లో అధికారుల తనిఖీలు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో కొన్ని నెలల నుంచి కొనసాగుతున్న అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి, ఇతర అభివృద్ధి పనులను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ అధికారులు బుధవారం సంయుక్తంగా తనిఖీ చేశారు. సికింద్రాబాద్ అడిషనల్ రైల్వే మేనేజర్ గోపాల్, సీనియర్ డీసీఎం షిపాలి, డీఓఎం జనరల్ సురేశ్‌కుమార్, డీఈఎన్ సెంట్రల్ ప్రంజల్ కేశర్‌వాణి తనిఖీ చేసి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, స్టేషన్‌లోని క్యాంటీన్, ప్లాట్‌ఫామ్‌లపై స్టాళ్లు, రైల్వే కాలనీలో నిర్మిస్తున్న రన్నింగ్ రూమ్‌లో తనిఖీలు చేపట్టారు. అనంతరం కాజీపేట జంక్షన్ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, ఏడీఈఎన్ సంతోశ్, అన్ని విభాగాల అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఈఆర్‌ఏఆర్‌ఎం వ్యాన్ కూడా..



యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ వ్యాన్ రైలులో తనిఖీ చేస్తున్న నారాయణస్వామి

రైలు ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు హుటాహుటిన ఘటనాస్థలికి తరలివెళ్లే ఎమర్జెన్సీ రైల్వే యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ వ్యాన్(ఈఆర్‌ఏఆర్‌ఎం)ను బుధవారం సికింద్రాబాద్ రైల్వే చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ (సీఎంఎస్) నారాయణస్వామి తనిఖీ చేశారు. వ్యాన్‌లో నిల్వ ఉండే మందులు, వైద్య పరికరాలు, ఇతరత్రా ఎమర్జెన్సీ ట్రీట్‌మెంట్ అందించే వైద్య సదుపాయాల సెటప్ కిట్లను తనిఖీ చేశారు. అనంతరం స్థానిక రైల్వే ఆస్పత్రి వైద్యాధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో కాజీపేట రైల్వే ఆస్పత్రి వైద్యులు నిరంజన్‌రావు, యాకూబ్, చీఫ్ ఫార్మసిస్ట్ చింత తిరుపతి, నర్సింగ్ సూపరింటెండెంట్ సుధీర్, రాజు, లక్ష్మీనారాయణ, సతీశ్, లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన రీజినల్ స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు



విద్యార్థి ఎత్తు కొలుస్తున్న డీఎస్‌ఏ కోచ్ దేవిక

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు నిర్వహించిన ఎంపికలు బుధవారం ముగిశాయి. డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్ కుమార్ పర్యవేక్షణలో జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్, అథ్లెటిక్స్, స్విమ్మింగ్ క్రీడాంశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎంపికల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు అశోక్‌కుమార్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేసి త్వరలో వ్యక్తిగతంగా సమాచారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శాట్ పరిశీలకులు డాక్టర్ రవికుమార్, నర్సింగరావు, స్వర్ణలత, సంతోశ్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పవన్, కరీం, స్వామిచరణ్, డీఎస్‌ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

అక్రమార్కులు ఎవరు..?



టీజీఎన్పీడీసీఎల్‌లో సబ్ ఇంజనీర్ల నియామకాల్లో అక్రమాలు

- విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు
- విచారణ ముగిసి నెలలు గడుస్తున్నా అక్రమార్కులను గుర్తించని వైనం
- మానవ వనరుల విభాగంలో అప్పటి ఉన్నతాధికారిదే హస్తమని చర్చ
- తన ప్రమేయం లేదంటున్న ఇండస్ట్రియల్ విభాగం కీలక అధికారి
- బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవడంపై యాజమాన్యం తాత్సారం
- పెద్దలు తప్పు చేస్తే మినహాయింపేనా..! ప్రశ్నిస్తున్న ఉద్యోగులు



హన్మకొండ : సబ్ ఇంజనీర్ల రిక్రూట్‌మెంట్‌లో జరిగిన అక్రమాలకు బాధ్యులను గుర్తించడంలో తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(టీజీ ఎన్పీడీసీఎల్) విఫలమైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నట్లు ప్రత్యేకంగా నియమించిన అత్యున్నత స్థాయి విచారణ కమిటీ నిగ్గు తేల్చింది. ఇది జరిగి నెలలు గడిచిపోతున్నాయే కాని ఇప్పటి వరకు బాధ్యులను గుర్తించి ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారిని కాపాడడంలో ఉన్న అంతర్యమేమిటని విద్యుత్ ఉద్యోగ వర్గాలతో పాటు నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

అక్రమాల్లో ఉన్నతాధికారిదే హస్తం..

ఈ అక్రమాల్లో మానవ వనరుల విభాగం ఉన్నతాధికారిదే హస్తం ఉందని విద్యుత్ ఉద్యోగ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. మానవ వనరుల విభాగానికి కీలకంగా వ్యవహరించిన ఆ పాలకవర్గ సభ్యుడు అంతా తానై సబ్ ఇంజనీర్ల నియామక ప్రక్రియ పూర్తి చేశాడని, ఇందులో తనకు ఏ మాత్రం సంబంధం లేదని నియామకాల ప్రక్రియ చూసుకునే కీలక ఇండస్ట్రియల్ రిలేషన్స్ విభాగ అధికారి సహా అధికారులు, ఉద్యోగుల ఎదుట తన బాధ చెప్పుకుంటున్నారని చర్చ సాగుతోంది. దీంతో నియామక ప్రక్రియలో అక్రమాలతో తనకు సంబంధం లేదని ఆయన చెప్పకనే చెప్పినట్లు తెలుస్తోందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈ కీలక అధికారిపై పలు ఆరోపణలుండడంతో మానవ వనరుల విభాగం కీలక బాధ్యుడు, పాలక మండలి సభ్యుడు నియామకాల ప్రక్రియతో సంబంధం లేని మరో జనరల్ మేనేజర్ సాయంతో అంతా తానై చూసుకున్నాడనే ప్రచారం కూడా సాగుతోంది. కాగా, పదవీచ్యుతుడైన మాజీ పాలకవర్గ బాధ్యుడు ఈ ఉచ్చులో చిక్కుకోనున్నాడా అనే సందేహాలు విద్యుత్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అక్రమాలు వాస్తవాలని తెలిసినా యాజమాన్యం ఎందుకు చర్యలకు ఉపక్రమించడం లేదో అర్థం కావడం లేదని విద్యుత్ ఉద్యోగులు తెలిపారు.

24 పోస్టుల భర్తీలో అక్రమాలు జరిగినట్లు గుర్తించిన కమిటీ..

టీజీ ఎన్పీడీసీఎల్ అధికారులు 497 సబ్ ఇంజనీర్ల పోస్టుల భర్తీకి 2018 మే 24న నోటిఫికేషన్ జారీ చేశారు. అదే ఏడాది జూలై 8న రాత పరీక్ష నిర్వహించారు. ఆగస్టు 31న ఫలితాలు ప్రకటించారు. డిసెంబర్‌లో నియామకాలు చేపట్టారు. ఇందులో ముందుగా కాల్ లెటర్లు పంపిన 24 మందిని కాకుండా ఇతరులతో భర్తీ చేశారు. ఇక్కడే అక్రమాలకు బీజం పడింది. కాల్ లెటర్ అందుకుని ఉద్యోగాలు రాని అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు. దీంతో టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం విచారణ చేపట్టింది. టీజీ పీఎస్‌సీ నుంచి ఒక అధికారి, టీఎస్ ఎస్‌పీడీసీఎల్ నుంచి ఇద్దరు, టీజీ ఎన్పీడీసీఎల్ నుంచి ఇద్దరు అధికారులతో కూడిన కమిటీ పూర్తి స్థాయిలో విచారణ జరిపింది. ఇందులో 24 పోస్టుల భర్తీలో అక్రమాలకు జరిగినట్లు గుర్తించింది. అర్హులు కాని వారు ఉద్యోగాలు పొందినట్లు గుర్తించిన విచారణ కమిటీ.. యాజమాన్యానికి నివేదిక అందించింది. ఈ నివేదిక మేరకు అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారికి నోటీసు జారీ చేయగా వారు కోర్టుకెళ్లారు. కోర్టు స్టే ఇవ్వడంతో ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. అయితే అన్యాయం జరిగిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకోవాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

కమిటీ నిజాలు నిగ్గు తేల్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..

టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మానవ వనరుల విభాగంలోని ఇండస్ట్రియల్ విభాగం నిర్వహిస్తుంది. ఈ క్రమంలో సబ్ ఇంజనీర్ల నియామకాల్లో అక్రమాలు వెలుగు చూసినా ఎలాంటి చర్య తీసుకోకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. కింది స్థాయి ఉద్యోగులు చిన్న తప్పులు చేస్తే చర్యలు తీసుకునే యాజమాన్యం.. ఇంత పెద్ద అక్రమం జరిగినా ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఆకాశరామన్న ఉత్తరాలు (పేరు లేని వినతులు) రాస్తే భూతద్దంలో పెట్టి చూస్తున్న యాజమాన్యం... ఆ యాజమాన్యం వేసిన విచారణ కమిటీ నిజాలు నిగ్గు తేల్చినా ఎందుకు చర్యలు తీసుకోకుండా నాన్చివేతధోరణి అవలంబించడంలో ఉన్న మతలబేమిటని ప్రశ్నిస్తున్నారు. చిన్న తప్పులకు ఉద్యోగులకు పెద్ద పనిష్మెంట్లు ఇచ్చే యాజమాన్యం, పెద్ద తప్పు చేసిన ఉన్నతాధికారులకు ఎలాంటి శిక్షలు ఉండవా అని నిలదీస్తున్నారు. సంస్థ వీలైనంత త్వరగా అక్రమార్కులపై చర్యలు తీసుకుని నిజాయితీ చాటుకోవాల్సిన అవసరం ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు.

అంతా నా ఇష్టం..

ఓ ఆర్టీసీ డిపోలో ఆ అధికారి తీరే వేరు!

- డబుల్ డ్యూటీలు చేసినా కార్మికులకు సెలవు ఇవ్వరు..
- ఆమె కోసం బస్ షెడ్యూల్‌నే మార్చిన అధికారులు
- ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలంటున్న కార్మికులు



హన్మకొండ: టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజియన్ మహబూబాబాద్ జిల్లా పరిధిలోని ఓ డిపో (జిల్లా కేంద్రం బయట)లో ఓ అసిస్టెంట్ మేనేజర్ తీరుపై కార్మిక వర్గాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆ అధికారి తీరే వేరంటూ కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా డబుల్ డ్యూటీలు చేసినా సాధారణ సెలవు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కార్మిక వర్గాలు వాపోయాయి. కార్మికుల విధులు విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించే ఈ అధికారి.. తన వరకు వస్తే మాత్రం తనకు రూల్స్ ఉండవని చెప్పకనే తన వైఖరి చాటుకుంటున్నారని కార్మికులు పేర్కొంటున్నారు. ఉద్యోగరీత్యా స్థానికంగా ఉండాల్సిన ఈ అధికారి.. పొరుగున ఉన్న పూర్వ జిల్లా కేంద్రం నుంచి రాకపోకలు సాగిస్తూ తనకు అనుకూలంగా బస్ షెడ్యూల్‌ను నిబంధనలకు విరుద్ధంగా మార్చుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హైదరాబాద్ నైట్ హాల్ రద్దు..

ఆ డిపో నుంచి హైదరాబాద్‌కు నడిచే యూపీఎల్-02 షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లో నైట్ హాల్ చేయాల్సి ఉండగా తాను ప్రతీ రోజు పూర్వ జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా హైదరాబాద్ నైట్ హాల్ రద్దు చేసి, తాను నివాసముండే పూర్వ జిల్లా కేంద్రానికి నడిపించుకుంటున్నారని ఆ డిపో కార్మికులు పేర్కొంటున్నారు. కిలోమీటర్లు చూపించుకునేందుకు ప్రయాణికుల రద్దీ లేని రూట్లలోనూ బస్సులు తిప్పుతున్నారని కార్మికులు వివరించారు. ఇంత జరుగుతున్న ఆ డిపో మేనేజర్ చోద్యం చూస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసరాలకు కూడా సెలవులు ఇవ్వడం లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. తన అవసరాల కోసం నిబంధనలు కాలరాసే ఆ అధికారి.. ఉద్యోగుల అవసరాలను పట్టించుకోవడం లేదని, ఇది వేధింపులకు గురి చేయడమేనని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రెవెన్యూ వసూళ్లు వందశాతం సాధించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

హన్మకొండ: రెవెన్యూ వసూళ్లు వందశాతం సాధించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్లు, నోడల్ జీఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీ పరిధిలోని 16 సర్కిళ్లలో పూర్తి స్థాయిలో రెవెన్యూ వసూళ్లు చేయాలని ఆదేశించారు. విధిగా నోడల్ జీఎంలు తమ పరిధిలోని సర్కిళ్లలో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. విద్యుత్ స్తంభాలకు కేబుల్ ఆపరేటర్లు చిందరవందరగా తీగలు అమర్చుతున్నారని, వీటిపై సర్వే నిర్వహించాలని ఆదేశించారు. పోల్ రెంటల్ విధిగా గ్రామాల్లో రూ.15, పట్టణం, నగరాల్లో రూ.20 చొప్పున వసూలు చేయాలన్నారు. సర్కిళ్లలో కాలిన, పనిచేయని మీటర్లను వెంటనే మార్చాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్‌లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.తిరుపతి రెడ్డి, చీఫ్ ఇంజనీర్లు కె.తిరుమల్‌రావు, రాజుచౌహాన్, అశోక్, వెంకటరమణ, జనరల్ మేనేజర్లు వేణు బాబు, కృష్ణ మోహన్, వెంకటకృష్ణ, శ్రీనివాస్, సత్యనారాయణ, సురేందర్, ఉత్తమ్, తదితరులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి జేఈఈ ఆత్మహత్య



దేవీలాల్(ఫైల్)

బయ్యారం: పురుగుల మందు తాగి నీటిపారుదల శాఖ జేఈఈ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కాపువారిగూడెం గ్రామానికి చెందిన పానుగోత్ దేవీలాల్(34) ఇరిగేషన్ జేఈఈగా గత అక్టోబర్‌లో గార్ల మండలంలో మొదటి పోస్టింగ్ పొందాడు. అప్పటినుంచి బయ్యారంలో గదిని అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఈ క్రమంలో దేవిలాల్ బుధవారం రాత్రి తన గదిలో పురుగులమందు తాగగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దివ్యాంగుడైన జేఈఈ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

రైలు కింద పడి యువకుడు..



నాగరాజు మృతదేహం

నెక్కొండ: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం నెక్కొండ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. వరంగల్ జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రాజు కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరు గ్రామానికి చెందిన పేరబోయిన నాగరాజు (35) మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై స్టేషన్ మాస్టర్ సమాచారం మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం తరలించినట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కాగా, నాగరాజు మృతికి గల వివరాలు తెలియాల్సి ఉంది.

‘భూ భారతి’తో ప్రతీ రైతుకు న్యాయం

- అధికారులు తప్పు చేస్తే చర్యలు
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

గోవిందరావుపేట: నిరుపేద రైతుల భూసమస్యలు పరిష్కరించడానికే రాష్ట్రంలోని ప్రజాప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందని, ఈ చట్టం ద్వారా ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూభారతి సదస్సులో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, ములుగు కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరీశ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ‘ధరణి’తో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. పేద రైతులకు కాకుండా పెద్ద రైతులకు న్యాయం జరిగిందన్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టంలో ప్రతీ రైతు సమస్య పరిష్కరిస్తామన్నారు. ప్రతీ రైతుకు న్యాయం చేయడానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని, తప్పు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతీ రైతుకు పట్టా అందించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి అనేక అంశాలతో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలోని రైతులందరూ తమ భూములపై హక్కులు పొందడానికి ఈ చట్టం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో వెకెన్సీలుగా ఉన్న అధ్యాపకుల పోస్టులలో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి(తాత్కాలిక పద్ధతిన) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌హై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిలాసఫీ, సోషియాలజీ, సైన్స్ పెడగాజీ, ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్ పెడగాజీ, సోషల్ సైన్స్ పెడగాజీ, తెలుగు పెడగాజీ, కంప్యూటర్ ఎడ్యుకేషన్ /ఐసీటీ,ఆరోగ్య వ్యాయామ విద్య, విజువల్ అండ్ పర్‌ఫార్మెన్స్, ఆర్ట్స్ సబ్జెక్టులలో ప్రతీసబ్జెక్టుకు ఒక్కో పోస్టుకు గెస్ట్ లెక్చరర్లను నియమించనున్నామని తెలిపారు. రిటైర్డ్ అయినవారితోపాటు నిరుద్యోగులు ఎంపిక సమయానికి 65 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు అర్హులన్నారు. కరిక్యూలర్ అభ్యర్థులకు నెలకు వేతనం రూ. 23,400, కో-కరిక్యూలర్ అభ్యర్థులకు రూ. 15,600 వేతనం చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ ధ్రువపత్రాలతో బీఈడీ కళాశాలలో దరఖాస్తుఫామ్ పూరించి ఫొటో జతచేసి ఈనెల13నుంచి 19వ తేదీవరకు దరఖాస్తుచేసుకోవాలన్నారు. ఈనెల 24 నుంచి 26వ తేదీవరకు మెరిట్ ప్రాతిపదికన 1:5 నిష్పత్తిలో డెమోలు, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా ఈనెల 18న వెల్లడిస్తామన్నారు. ఎంపికైన వారు బీఈడీ కళాశాలలో జూలై 1న రిపోర్టు చేయాల్సింటుందని తెలిపారు.

అప్పు తీసుకుని ఇవ్వడం లేదని..

- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య
- అబ్బాపూర్‌లో ఘటన



రాజు మృతదేహం

ములుగు రూరల్: పైసాపైసా కూడబెట్టిన రూ. 3లక్షలను వ్యాపారి అప్పుగా తీసుకుని ఇవ్వడం లేదనే కారణంతో ఓ వ్యక్తి మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని అబ్బాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాదె రాజు (48) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఫర్టిలైజర్ వ్యాపారికి పైసాపైసా కూడబెట్టిన రూ. 3 లక్షలను మూడు సంవత్సరాల క్రితం అప్పుగా ఇచ్చాడు. అయితే సంవత్సరం నుంచి అప్పు చెల్లించాలని పలుమార్లు అడుగుతున్నా సదరు వ్యాపారి చెల్లించక పోవడంతో రాజు దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. వడ్డీ ఇవ్వకున్నా అసలు డబ్బు అయిన ఇవ్వాలని ప్రాధేయపడినా సదరు వ్యాపారి ఇవ్వక పోవడంతో రాజు మంగళవారం రాత్రి వ్యాపారి బిల్డింగ్‌పై పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు బుధవారం ఉదయం గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకుని రాజు మృతికి గల వివరాలు తెలుసుకున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆయుర్వేద అవసరం పెరిగింది

- ఆరోగ్యపరంగా అనేక సమస్యలకు సహజ పరిష్కారం
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా
- స్టేట్ లెవల్ కౌశలం-2025 శిబిరం ప్రారంభం



ఆయుర్వేద పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన ప్రముఖ వైద్యులు

జనగామ: ఆధునిక యుగంలో ఆయుర్వేద వైద్యానికి ఉన్న అవసరం మరింత పెరిగిందని జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. జిల్లా కేంద్రంలోని వేద పంచ కర్మ ఆయుర్వేద వెల్‌నెస్ సెంటర్, తెలంగాణ విశ్వ ఆయుర్వేద పరిషత్ ఆధ్వర్యంలో ఆయుర్వేద విద్యార్థులకు స్టేట్‌లెవల్ కౌశలం-2025 ఐదురోజుల ప్రోగ్రాం బుధవారం ప్రారంభమైంది. ‘వేద’ హాస్పిటల్ డాక్టర్ అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిక్షణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టేట్‌లెవల్‌లో జరిగే శిక్షణలో విద్యార్థులకు పాఠ్యాంశాల్లోనే లేని అనేక ప్రామాణిక విషయాలను నేర్చుకునే గొప్ప అవకాశం కలుగుతుందన్నారు. ఒత్తిడి, జీవనశైలి రుగ్మతలు, నడుము, మెడ నొప్పి వంటి సమస్యలకు సహజ పరిష్కారం ఆయుర్వేద వైద్యమన్నారు. జిల్లాలో ఈ తరహా ఆరోగ్యవంతమైన కార్యక్రమాలు విస్తృతంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై దృష్టి సారించాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్‌కు సూచించారు. ఆయుర్వేద వైద్యాధికారులను సమన్వయం చేసుకుంటూ ఈ వైద్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి సుమారు వంద మందికి ఉచితంగా మందులు అందించారు. అంతకు ముందు డాక్టర్ అంజిరెడ్డి రచించిన ‘వై టూ చాయిస్ వేద’ పుస్తకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వ ఆయుర్వేద పరిషత్ వైస్ ప్రెసిడెంట్ టి.ప్రేమానందరావు, వీఏపీ ప్రెసిడెంట్ ఎస్.శారంగపాణి, వీఏపీ జనరల్ సెక్రటరీ, బి.కిషన్, హైదరాబాద్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ప్రొఫెసర్, ప్రభుత్వ వైద్యుడు, కల్నల్ బిక్షపతి, డాక్టర్లు యశోదా, మమతా, సురేశ్ జకోటియా తదితరులు పాల్గొన్నారు. కాగా 15వ తేదీ వరకు స్టేట్ లెవల్ కౌశలం ప్రోగ్రాం కొనసాగనుంది.

ఎయిడెడ్ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎయిడెడ్ టీచర్ల జాక్ బాధ్యులు

విద్యారణ్యపురి: ఎయిడెడ్ టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి హనుమకొండలోని పీఆర్‌టీయూ భవనంలో తెలంగాణ ఎయిడెడ్ ఉపాధ్యాయుల జాక్ కన్వీనర్ ఎం.కె. తన్వీర్ అధ్యక్షతన శ్రీపాల్‌రెడ్డి అభినందన సభ నిర్వహించారు. ఈ సభలో శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. తన హైస్కూల్ విద్యాభ్యాసం ఎయిడెడ్‌లోనే జరిగిందన్నారు. ఎయిడెడ్ టీచర్లకు ప్రతీ నెల ఆలస్యంగా వేతనాలు వస్తున్నాయన్నారు. ఆరోగ్య భద్రత, పదోన్నతులు, కారుణ్య నియామకాల సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న ఈ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎయిడెడ్ టీచర్ల జాక్ బాధ్యులు సీతారామాచారి, శ్రీధర్, శివకుమార్, సరళ, తిరునగరి నరేందర్, జాక్ కోకన్వీనర్ బెల్లంకొండ పూర్ణచందర్ మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎం. తిరుపతిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఫలితశ్రీహరి, బాధ్యులు తోట భిక్షపతి, శ్రీనివాస్, గఫార్, తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయ ధర్మకర్తల మండలి ఏర్పాటు

హన్మకొండ కల్చరల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం దేవాదాయధర్మాదాయశాఖ భద్రకాళి దేవాలయానికి ధర్మకర్తల మండలి ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో 2012లో ధర్మకర్తల మండలి ఏర్పాటు చేయగా 2014 వరకు కొనసాగింది. అప్పటి నుంచి 11సంవత్సరాలుగా పాలకమండలి లేదు. ఈ మేరకు భద్రకాళి దేవాలయానికి వంశపారంపర్యేతర ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేశారు. టి.వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్‌కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీశ్, మోత్కూరి మయూరి, గండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగుల ఆంజనేయులు, జె.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాస్‌రావును సభ్యులుగా నియమించారు. ప్రమాణస్వీకారం చేసిన తేదీ నుంచి సంవత్సరంపాటు పదవిలో కొనసాగుతారు. అలాగే, దేవాలయ ముఖ్య అర్చకుడు పి. నర్సింహమూర్తిని ధర్మకర్తల మండలిలో ఎక్స్-అఫీషియో(దేవాలయ ముఖ్య అర్చకుడిగా కొనసాగుతూ ధర్మకర్తల మండలిలో పదవి కలిగి ఉండడం) సభ్యుడిగా ఉంటారు.

బీసీ సమాజాన్ని రాజకీయ శక్తిగా మార్చాలి

- ఆల్‌ఇండియా ఓబీసీ చైర్మన్ సాయిని నరేందర్



సమావేశంలో ఆల్‌ఇండియా ఓబీసీ చైర్మన్ నరేందర్, తదితరులు

విద్యారణ్యపురి: తరాలుగా ఉత్పత్తి శ్రమలో కీలక పాత్ర పోషిస్తున్న బీసీ సమాజాన్ని రాజకీయ శక్తిగా మార్చడమే లక్ష్యమని ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ అన్నారు. బుధవారం హనుమకొండలోని టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన ఆ ఓబీసీ జాక్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజహితం కోసం నిత్యం శ్రమ చేస్తున్న బీసీ సమాజం నేడు బతకలేక ఎంతో మంది బలిదానాలు చేసుకుంటున్నారన్నారు. బీసీ సమాజాన్ని రాజకీయ శక్తిగా మార్చి చట్టసభల్లో వాటా సాధించాలని పిలుపునిచ్చారు. సమాజంలో బీసీ సంఘాలు విడిపోయి పాలకవర్గాలకు పావులుగా మారాయన్నారు. విడిపోయిన కుల, బీసీ సంఘాలను ఐక్యం చేయడమే ఓబీసీ లక్ష్యమన్నారు.

ఏఐఓబీసీ జిల్లా కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో ఏఐఓబీసీ కమిటీని ఎన్నుకున్నారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా తాడిశెట్టి క్రాంతి కుమార్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి వీరస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి. వెంకటాచారి, కోశాధికారిగా తాడూరి మోహన్, ఉపాధ్యక్షులుగా వల్లాల జగన్ గౌడ్, తాటికొండ సద్గుణ, నవీన్‌కుమార్, రాచమల్ల శ్రీనివాస్, మహ్మద్ ఇస్మాయిల్, సెక్రటరీలుగా నిరంజన్, కృష్ణమూర్తి, రవికుమార్, నారాయణగిరి రాజు ఎన్నికయ్యారు. సలహాదారులుగా పులి రజనీకాంత్, గౌరవ అధ్యక్షుడిగా పులి శ్రీనివాస్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర కన్వీనర్ సోమ రామ్మూర్తి, బీసీ పొలిటికల్ జాక్ నాయకులు మాదం రజనీకుమార్, జాక్ బాధ్యులు కె. రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.